సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



వర్షం నీటితో అవస్థలు!

అజీజ్‌నగర్ గ్రామానికి వెళ్లే చౌరస్తాలో భారీగా నిలిచిన వర్షం నీటితో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. 8లో▸



దళితవాడకు అడ్డంగా కంచె

తమ కాలనీకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా కొందరు కంచె వేశారని బూర్గుల దళితవాడకు చెందిన బాధితులు వాపోయారు. 8లో▸



నేడు రేషన్ కార్డుల పంపిణీ

లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీకి మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నారు. 8లో▸

రికవరీ

అక్రమార్కుల గుండెల్లో గుబులు

- యాచారం, కొత్తూరు భూసేకరణలో అక్రమాలు
- పెద్దలకు ఫలహారంగా మారిన భూ నష్టపరిహారం
- సిద్ధాపూర్‌లో ఇప్పటికే 80 మంది గుర్తింపు..
- తాజాగా యాచారం ఫార్మాసిటీలోనూ సర్వే షురూ



కొత్తూరు: సిద్ధాపూర్‌లో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల కోసం సేకరించిన పొలం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అక్రమార్కుల గుండెల్లో రికవరీ గుబులు పట్టుకుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాడు అడ్డగోలుగా తిన్నదంతా కక్కించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే సిద్ధాపూర్ భూముల్లో 80 మంది నకిలీలను గుర్తించిన సర్కార్ తాజాగా ఫార్మాసిటీ భూముల్లోని పెద్ద గద్దలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. యాచారం మండలం నక్కర్తిమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి సహా పలు రెవెన్యూ గ్రామాల్లో సర్వే షురూ చేసింది. ప్రభుత్వం నుంచి పరిహారం పొందిన వారిలో ఎవరు అసలో.. ఎవరూ నకిలీనో.. తేల్చేపనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. దీంతో నకిలీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎక్కడ తాము దొరికి పోతామో అనే భయం వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

సిద్ధాపూర్‌లోనూ వాలిన గద్దలు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామం సర్వే నంబర్ 252, 278, 361లోని 330.34 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములను సేకరించి, టీజీఐఐసీకి బదలాయించింది. ఇందులో 97.24 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 160 ఎకరాలు అసైన్డ్ భూమి, మరో 73.1 ఎకరాలు ఖాళీ భూమి ఉంది. అప్పటి ప్రభుత్వం అసైన్డ్ రైతులకు ఎకరానికి రూ.10.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. పరిహారం పొందిన వారిలో వాస్తవ భూ విస్తీర్ణానికి మించి పొందిన వారు కూడా ఉన్నారు. పొజిషన్‌లో ఉన్న 15 మంది అసలైన లబ్ధిదారులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. పొజిషన్‌లో ఉన్న వారికి కాకుండా లేని వారిని అసైన్డ్‌దారులుగా చూపించి ప్రభుత్వ నిధులను కొల్లగొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై విచారణకు ఆదేశించడం తెలిసిందే. ప్రభుత్వం నుంచి 80 మంది రూ.8.50 కోట్లకుపైగా పరిహారం పొందినట్లు నిర్ధారించి ఇప్పటికే వారికి నోటీసులు జారీ చేశారు.

ఫార్మాలోనూ పాగా

జిల్లాలోని కందుకూరు, యాచారం మండలాల్లో 19,333 ఎకరాల్లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 13,500 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములను సేకరించి, టీజీఐఐసీకి అప్పగించింది. భూములు ఇచ్చిన రైతులకు మొదట్లో పట్టా భూములకు రూ.12.50 లక్షల చొప్పున, అసైన్డ్ దారులకు రూ.8 లక్షలు చొప్పున, ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న వారికి రూ.7.70 లక్షల చొప్పున నగదుతో పాటు ఎకరానికి 121 గజాల ప్లాటు చొప్పున పరిహారం చెల్లించింది. తర్వాత కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించడంతో పరిహారాన్ని డబుల్ చేసింది. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన మరికొంత మంది రైతులకు సంబంధించిన పరిహారాన్ని అథారిటీలో జమ చేసింది. మీర్‌ఖాన్‌పేటలో టీజీఐఐసీ అభివృద్ధి చేసిన వెంచర్‌లోని ప్లాట్లకు ఇటీవల లాటరీ నిర్వహించి లబ్ధిదారులకు ప్లాట్ నంబర్లను కేటాయించి, వారి పేరున రిజిస్ట్రేషన్ కూడా చేసింది.



యాచారం: నక్కర్తి మేడిపల్లిలో పోలీస్ పహారా మధ్య సర్వే నంబర్ల వారీగా భూ విస్తీర్ణం గుర్తింపు

కొల్లగొట్టి.. ప్రభుత్వానికే అంటగట్టి

ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతుల్లో అసలైన వారితో పాటు నకిలీలు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నట్లు తెలుస్తోంది. యాచారం మండలం నక్కర్తిమేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తిలోని ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి, అవే భూములను ఫార్మాసిటీకి అప్పగించి పెద్ద మొత్తంలో నిధులు కొల్లగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాడిపర్తి సర్వే నంబర్ 104లోని 250 ఎకరాల భూదాన్ భూముల సేకరణలోనూ భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ భూములను కొల్లగొట్టి.. అదే ప్రభుత్వానికి ఆయా భూములను అంటగట్టారు. నకిలీలను గుర్తించి, వారు తిన్నదంతా కక్కించేందుకు ప్రభుత్వం తాజాగా మేడిపల్లిలోని సర్వే నంబర్ల వారీగా భూ విస్తీర్ణం సహా కబ్జాలో ఉన్న రైతుల వివరాలపై ఆరా తీస్తోంది. భూములు లేకపోయినా ఉన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వం నుంచి అందిన పరిహారాన్ని ఫలహారంగా దిగమింగిన వారి వివరాలను సేకరిస్తుండటంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది.

సన్నాలకు బోనస్ సున్నా

- సన్నవడ్లకు జమ కాని ప్రోత్సాహకం డబ్బులు
- నెలల తరబడి ఎదురుచూస్తున్న అన్నదాతలు
- నిత్యం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- జిల్లాలో పండించిన రైతులు : 2,744 మంది
- విక్రయించిన ధాన్యం : 13,700 మెట్రిక్ టన్నులు
- రైతులకు అందాల్సిన మొత్తం: రూ.6.85 కోట్లు



ధాన్యం కొనుగోలు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులను ప్రోత్సహించడం కోసం సన్నాలకు బోనస్ అని ప్రకటించిన ప్రభుత్వం ఈ మేరకు అందించడంలో తాత్సారం చేస్తోంది. ధాన్యం విక్రయించిన రైతులు డబ్బుల కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో రబీ సీజన్ వరి కొనుగోలు చేయడం కోసం ఏప్రిల్ 20 నుంచి జూన్ 31 వరకు 30 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకొని 5,074 మంది రైతుల నుంచి 25 వేల మెట్రిక్ టన్నులు మార్కెటింగ్ శాఖ పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌ల ద్వారా సేకరించారు. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాలుకు అదనంగా రూ.500 చెల్లించనున్నట్లు కాంగ్రెస్ సర్కార్ ప్రకటించింది. దీంతో రైతులు విరివిగా పండించారు. క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర ప్రకటించగా మొత్తం రూ.58 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు. బోనస్ చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతల ఆందోళన

ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ డబ్బుల కోసం అన్నదాతలు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారుల వద్ద స్పష్టత లేకపోవడంతో బోనస్ ఇస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 2,744 మంది రైతులు 13,700 మెట్రిక్ టన్నుల సన్నవడ్లు పండించారు. ఈ ధాన్యం మొత్తం ప్రభుత్వమే సేకరించింది. ఈ మేరకు రైతులకు బోనస్‌గా రూ.6.85 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

ఎదురుచూపులే..



సన్నాలకు ప్రోత్సాహకం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో చాలామంది రైతులు పుష్కలంగా పండించారు. ఇస్తామన్న బోనస్ నేటికీ ఇవ్వలేదు. ఎదురుచూపులు తప్పడం లేదు. వెంటనే రైతుల గోడు పట్టించుకొని రావాల్సిన మొత్తం ఇవ్వాలని కోరుతున్నాం.

– మొద్దు అంజిరెడ్డి, రాష్ట్ర ఉత్తమరైతు అవార్డు గ్రహీత

త్వరలో జమ అవుతాయి



మా శాఖ నుంచి చేయాల్సిన పనులు పూర్తి చేశాం. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. త్వరలో రైతులకు డబ్బులు అందుతాయి.

– వనజాత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కె.చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కొంగర సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌కు చేరుకున్న ఆయనకు ఏఓ సునిల్‌కుమార్ స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. గతంలో ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పని చేసిన ఎంవీ భూపాల్ రెడ్డి ఏసీబీ కేసులో అరెస్ట్ కావడం తెలిసిందే. అప్పటి నుంచి ఆ స్థానంలో అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్ ప్రతిమా సింగ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం విధితమే. ప్రస్తుతం ప్రతిమా సింగ్ మెటర్నిటీ సెలవులో వెళ్లడంతో ప్రభుత్వం హెచ్ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీగా పని చేస్తున్న కె.చంద్రా రెడ్డిని అదనపు కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నేటినుంచి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ కోర్సుల్లో మొత్తం 45 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన వారు, పాలిటెక్నిక్ అర్హత పరీక్ష రాసిన వారు సర్టిఫికెట్లతో కళాశాలలో ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలన్నారు. ఈ నెల 11న మూడు కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 94901 20175 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మహిళా శక్తి భవనాలు మంజూరు చేయండి



సెర్ప్ సీఈఓ దివ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నియోజకవర్గంలో మహిళా శక్తి భవనాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయానికి వెళ్లిన ఆయన సీఈఓ దివ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.ఫరూఖ్‌నగర్, చౌదరిగూడ, నందిగామ మండలాల్లో మహిళా శక్తి భవనాలు నిర్మించేందుకు ఒక్కో భవనానికి కోటి రూపాయల చొప్పున మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయండి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గానికి మొత్తం 79 ట్రాన్స్‌ఫార్మర్లు, 32,300 మీటర్ల కండక్టర్, 74వేల మీటర్ల కేబుల్, విద్యుత్ స్తంభాలు 798 మంజూరు చేయాలని కోరారు.

ఫార్మా భూ సర్వేకు సహకరించాలి



ఫార్మాసిటీకి సేకరించిన భూములను పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

యాచారం: ఫార్మాసిటీకి పరిహారం అందజేసి సేకరించిన భూముల సర్వేకు రైతులు సహకరించాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో అధికారులు చేపట్టిన రైతుల కబ్జా భూముల సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. సర్వేలో ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. డీసీపీ వెంట ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ ఉన్నారు. కాగా, తాడిపర్తిలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలోని కొందరు రైతులు పట్టా భూములు ఇవ్వడానికి ముందుకు రాగా వాటిని పరిశీలించారు. ఫార్మా భూముల సర్వేలో అభ్యంతరాలుంటే యాచారం తహసీల్దార్ అయ్యప్పకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

రిజర్వేషన్లు ఆమోదించకుంటే ఉద్యమం

కడ్తాల్:42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యవర్గ సభ్యుడు కందుకూరి జగన్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో సోమవారం ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. తక్షణమే బీసీ రిజర్వేషన్లను ఆమోదించి అమలు చేయాలని లేని పక్షంలో బీసీ సామాజికవర్గాన్ని ఐకమత్యం చేసి, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకోసం మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ సామాజికవర్గ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ శివశంకర్, నాయకులు శివగల రమేశ్, గుమ్మడి కరుమయ్య, పెంటయ్య, పోచయ్య పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



జయేశ్ రంజన్‌ను సన్మానిస్తున్న వర్సిటీ చాన్స్‌లర్లు

నందిగామ: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి, పర్యాటక సాంస్కృతిక క్రీడల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. మండల పరిధిలోని మొదుళ్లగూడ శివారులోని సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించి దీక్షారంబ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహిస్తోందని తెలిపారు. టెక్నాలజీ రంగంలో శరవేగంగా మార్పులు వస్తున్నాయని, వాటికి అనుకూలంగా విద్యార్థుల్లో సైతం మార్పురావాలని సూచించారు. టెక్నాలజీలో ప్రపంచంతో పోటీ పడేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.సైబర్ క్రైం డీసీపీ సాయి శ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్స్‌లర్లు విద్యా యెరవడేకర్, శంతరాం బలవంత్ ముజుందార్, వైస్ చాన్సలర్ రామకృష్ణన్ రామన్, కుమార్ విజయ్ మిశ్రా, వేణుగోపాల్ రెడ్డి, పలువురు డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఫుల్

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులో రాజీవ్ స్వగృహకు చెందిన ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు పోటీ పెరిగింది. సోమవారం బహిరంగ వేలం ద్వారా విక్రయించే ప్రక్రియ ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా శ్రీశైలం హైవే తుక్కుగుడ సమీపంలోని కుర్మల్‌గూడలో 15 ప్లాట్లు అమ్ముడు పోయాయి. 260 చదరపు గజాల నుంచి 300 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్ల కొనుగోలుకు పలువురు పోటీ పడ్డారు. చదరపు గజానికి రూ.20 వేలు ఆఫ్‌సెట్ ధరగా నిర్ణయించగా వేలం పాటలో చదరపు గజం రూ.28,500కు కొనుగోలు చేశారని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో 34 మంది పాల్గొన్నరని, ఈ భూముల విక్రయాల ద్వారా రూ.9.6 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బహదూర్‌పల్లి లోని 68 ఓపెన్ ప్లాట్లు, బుధవారం రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లోని 200–500 చదరపు గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

మాత్రలు వేద్దాం.. ‘నులి’మేద్దాం



అల్బెండజోల్ మాత్రలు ప్రదర్శిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకటి నుండి 19 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలందరికీ విధిగా అల్బెండజోల్ మాత్రలు వేయించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 11న అల్బెండజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ మాత్రలపై అవగాహన కల్పించి, వందశాతం లక్ష్యం పూర్తయ్యేలా చూడాలన్నా రు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ఓ సంగీత, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, డీఈఓ సుశీందర్‌రావు పాల్గొన్నారు.

ప్రజావాణికి 82 ఫిర్యాదులు

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత నిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉపాధి కోసం డీఈఈటీ

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)ను ప్రారంభించిందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఈఈటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రైవేట్ సంస్థల్లో నిరుద్యోగ యువతకు నిరంతర ఉపాధి కల్పించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఆధారితమైన డీఈఈటీ వెబ్‌సైట్‌ను గత సంవత్సరం డిసెంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు. నిరుద్యోగులు ఈ వెబ్‌సైట్‌లో ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు వారి నైపుణ్యం, విద్యార్హత, నివాసం మొదలైన వాటి ఆధారంగా ఉద్యోగ సమాచారం అందించబడుతుందన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ఓ సంగీత పాల్గొన్నారు.

దళితవాడకు అడ్డంగా కంచె



కంచె వద్ద ఆందోళన వ్యక్తంచేస్తున్న దళితులు, గ్రామస్తులు

రాకపోకలకు అవస్థలు పడుతున్నామని బాధితుల ఆందోళన

షాద్‌నగర్ రూరల్: తమ కాలనీకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా కొందరు వ్యక్తులు కంచె వేశారని ఫరూఖ్ నగర్ మండలం బూర్గుల దళితవాడకు చెందిన బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తులు, దళితుల కథనం ప్రకారం.. బూర్గుల గ్రామంలోని సర్వేనంబర్ 130లో స్వాతంత్ర్య సమరయోధుడు బూర్గుల నర్సింగ్‌రావు స్థానిక అవసరాల నిమిత్తం యాభై ఏళ్ల క్రితం ఎకరా పది గుంటల భూమిని కేటాయించారు. ప్రస్తుతం ఇది పశువుల మంద స్థలంగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. గ్రామం కోసం కేటాయించిన ఈ భూమిలో కొంతమంది నిరుపేద దళితులు పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన స్థలంలో పంచాయతీ తరఫున బోర్లు వేసి గ్రామానికి నీటి సరఫరా అందించడంతో పాటు పశువుల కోసం నీళ్ల తొట్టి నిర్మించారు. ఇళ్లు కట్టుకున్న దళితులు ఈ భూమిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 130లోని 20 గుంటల భూమి మాదేనంటూ బూర్గుల నర్సింగ్‌రావు బంధువు ఆ స్థలం చుట్టూ ఇనుప కంచె వేశారు. దీంతో ఇళ్లకు వెళ్లే దారి లేక ఇబ్బంది పడుతున్నామని దళితులు తెలిపారు. ఇటీవల ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి సంబంధించిన సామాగ్రిని తరలించేందుకు కొంత కంచెను తొలగించాడు. ఈ విషయం తెలుసుకున్న సదరు వ్యక్తులు తనకు ఫోన్ చేసి బెదిరించారని తెలిపాడు. బూర్గుల నర్సింగ్‌రావు ఆశయ సాధనకు కృషి చేయాల్సిన వారి కుటుంబ సభ్యులే ఇలా దళితులను చిన్నచూపు చూస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న దారిని మూసేసి కంచె నిర్మించడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై బాధితులు పోలీసులు, పంచాయతీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం.

నేడు రేషన్ కార్డుల పంపిణీ



అధికారులతో మాట్లాడుతున్న కేఎల్లార్

- హాజరుకానున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నారని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జ్ కేఎల్లార్ తెలిపారు. మల్లాపూర్‌లోని యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఫంక్షన్ హాలులో కొనసాగుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి 12 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని స్పష్టంచేశారు. లబ్ధిదారులు విధిగా హాజరై కార్డులు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నవారు మల్లారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'డబుల్ ఇళ్లు' స్థానికులకే ఇవ్వాలి

తుక్కుగూడ: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూంల పనులను పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. వీటి పంపిణీలో స్థానికులకే మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం



వసంత్ కుమార్ (ఫైల్)

శంకర్‌పల్లి: డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన వసంత్‌కుమార్(18) డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. గత నెల 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా, బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

దుద్యాల్: బైక్ అదుపుతప్పడంతో ఓ ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆలేడ్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని కుదురుమల్లకు చెందిన శివగల్ల కృష్ణ దుద్యాల్ గేట్ నుంచి కుదురుమల్లకు తన బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన గ్రామస్తులు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

వైద్య శిబిరానికి స్పందన

380 మందికి ఉచిత పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవీందర్ యాదవ్

తాండూరు టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ అర్బన్ పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 380 మంది పేషంట్లు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. డీఎంహెచ్ఓ లలితాదేవి ఆదేశానుసారం ఏర్పాటు చేసిన ఈ శిబిరం విజయవంతమైంది అన్నారు. 62 మందికి ఆపరేషన్ల నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశామన్నారు. వీరికి వారం రోజుల్లో ఆపరేషన్లు పూర్తి చేస్తామన్నారు. అనంతరం పేషెంట్లకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు గిరిధర్, అక్షయ్, అఖీల్ ఖాన్, రాధ, రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాజ్యోతి కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

వర్షం నీటితో అవస్థలు!

మొయినాబాద్ రూరల్: అజీజ్‌నగర్ గ్రామానికి వెళ్లే చౌరస్తాలో భారీగా నిలిచిన వర్షం నీటితో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సోమవారం సాయంత్రం దాదాపు గంటపాటు కురిసిన వర్షంతో జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ



అధికారులతో మాట్లాడుతున్న కేఎల్లార్

- హాజరుకానున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నారని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జ్ కేఎల్లార్ తెలిపారు. మల్లాపూర్‌లోని యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఫంక్షన్ హాలులో కొనసాగుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి 12 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని స్పష్టంచేశారు. లబ్ధిదారులు విధిగా హాజరై కార్డులు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నవారు మల్లారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్



తాండూరు రూరల్: రేషన్‌కార్డు లబ్ధిదారులతో ధారాసింగ్ తదితరులు

తాండూరు రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో గ్రామానికి చెందిన 151 మందికి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రేషన్‌కార్డు ఇచ్చిన దాఖాలలు లేవన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, పీసీసీ మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు ప్రవీణ్ కుమార్, జితేందర్‌రెడ్డి, విద్యాసాగర్, ఆనంద్‌చారి, షబ్బీర్, నర్సింలు, ఫయాజ్, మల్లేశం, ఇక్బాల్, మినహాజ్, బుజ్జమ్మ, ఎర్రబాలప్ప, శంకర్‌నాయక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



బొంరాస్‌పేట: రేషన్‌కార్డు మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రేషన్‌కార్డులను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. బురాన్‌పూర్, తుంకిమెట్ల తదితర గ్రామాల్లో లబ్ధిదారులు కార్డులు అందుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, గౌడ సంఘం మండల నాయకులు ప్రకాశ్‌గౌడ్, భీమయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



నరేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని ముజాహిద్‌పూర్ ప్రభుత్వ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా అన్నారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ మాడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న నరేశ్ ఈ నెల 2, 3 తేదీల్లో చెన్నైలోని రామకృష్ణ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలలో ప్రతిభను కనబరిచాడు. ఈ మేరకు ఆయన్ను జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం నరేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

తాండూరు మున్సిపల్ డీఈ మణిపాల్



తాండూరు టౌన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మణిపాల్

తాండూరు టౌన్: పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పట్టణ మున్సిపల్ డీఈ, ఇంచార్జి కమిషనర్ మణిపాల్ సూచించారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పాత తాండూరులోని ప్రభుత్వ నెంబర్-2 పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. ఇళ్లు, పాఠశాల, మైదానం వంటి ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లోని పూల కుండీల్లో, టైర్లలో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. ఇంటిలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి, మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోతే ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగుతూ వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడంతో పాటు ఇంట్లో వారికి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ గౌడ్, పాఠశాల హెచ్‌ఎం ప్రతిభా భారతి, వార్డు ఆఫీసర్లు కార్తీక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేయాలి



పరిగి: పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వెంకటయ్య

పరిగి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని గంగపుత్ర కాలనీలో వందరోజుల ప్రణాళికలో భాగంగా ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు రోజు తడి చెత్తను పొడి చెత్తను వేరు వేరుగా వేయాలని సూచించారు. చెత్త సేకరణకు ప్రతి రోజు వాహనాలు వస్తున్నాయని వాటిలోనే చెత్తను వేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

వ్యాధి తగ్గడం లేదని మనస్తాపం



కిష్టయ్య (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: వ్యాధి తగ్గడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని కేశంపేట రైల్వేగేట్ సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ బల్లేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా, పూడూరు మండలం కంకల్‌కు చెందిన పిచ్చకుంట్ల కిష్టయ్య(80) కుటుంబంతో కలిసి కొన్నేళ్లుగా పట్టణంలోని రతన్‌కాలనీలో అద్దెకు ఉంటున్నారు. కిష్టయ్య చాన్నాళ్లుగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తగ్గకపోవడం, వృద్ధాప్య సమస్యలు చుట్టుముట్టడంతో చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఉదయాన్నే గూడ్సు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన రైల్వే పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం బాడీని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ముగ్గురు కుమారులు ఉన్నారు. స్టేషన్ మాస్టర్ రాహుల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

నేడే ఆఖరు



ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ దుకాణాల సముదాయంలోని షాపుల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు మంగళవారం ముగియనుందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1-ఏ, 13-ఏ, 16- ఏ, 17-ఏ నంబర్ దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు సీల్డ్ టెండర్ల ద్వారా వేలం నిర్వహించి, షాపులను కేటాయిస్తామన్నారు. ఇందులో పాల్గొనే వారు ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి ఎంపీడీఓ, ఎంపీపీ ఫరూఖ్‌నగర్ పేరుపై డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి దరఖాస్తు ఫారాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. బుధవారం ఆఫీసులో సీల్డ్ టెండర్లను తెరిచి, దుకాణాలను కేటాయించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

మొయినాబాద్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై మొయినాబాద్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎనికేపల్లి గ్రామానికి చెందిన చీపిరి రాజుకు 2012లో నాగిరెడ్డిగూడకు చెందిన సరితతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సరితకు మరో ముగ్గురు అక్కాచెల్లెల్లు ఉన్నారు. సోదరులు లేకపోవడంతో పుట్టింటి నుంచి భూమి, ఇల్లు ఇప్పించాలని రాజు కొన్నేళ్లుగా భార్యను వేధిస్తున్నాడు. అతని బాధ భరించలేక కొంత కాలం క్రితం 6 గంటల భూమి ఇచ్చారు. అయినా ఇల్లు కావాలంటూ ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో గత ఆదివారం సరిత పుట్టింటికి వెళ్లిపోయింది. రాత్రి అక్కడికి చేరుకున్న రాజు భార్యపై దాడిచేశాడు. దీంతో సోమవారం ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ

ఎంఈఓ చంద్రప్ప



ఫిజియోథెరపీ చేయిస్తున్న వైద్యులు

బంట్వారం: వారానికోసారి నిర్వహించే ఫిజియోథెరపీకి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను తల్లిదండ్రులు తప్పక తీసుకురావాలని కోట్‌పల్లి ఎంఈఓ చంద్రప్ప అన్నారు. సోమవారం భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు డాక్టర్ శ్రీకాంత్ ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సుమారు 20 మందికి పైగా పిల్లలకు ఫిజియోథెరపీ చేయించామన్నారు. వీరికి ప్రతిరోజు తరగతులు ఉంటాయన్నారు. వారానికోసారి ఫిజియోథెరపీ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి తీసుకురావాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ స్పెషల్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీకాంత్, ఐఈఆర్పీ దిలీప్‌కుమార్, సీఆర్పీ నర్సింలు పాల్గొన్నారు.

పోక్సో నిందితుడికి ఇరవై ఏళ్ల జైలు

ఆమనగల్లు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా ఓ బాలికకు దగ్గరై మోసం చేసిన వ్యక్తికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లుకు చెందిన వెంకటేశ్‌పై 2021లో పోక్సో కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన షాద్‌నగర్ పోక్సో కోర్టు నిందితుడికి పైశిక్ష విధిస్తూ తీర్పు వెలువర్చింది. గతంలో ఇక్కడ పని చేసిన డీఎస్పీ కుషాల్కర్, ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్, కోర్టు కానిస్టేబుల్‌లు యాదయ్య, జగన్ నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించారు.

కేసు నమోదు

మొయినాబాద్: అక్రమంగా తమ భూమిలోకి చొరబడి దాడి చేసిన వ్యక్తులపై ఓ రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం పొద్దటూరుకు చెందిన గౌండ్ల కిష్టగౌడ్‌కు మొయినాబాద్ మండలం చిన్నమంగళారం రెవెన్యూలోని సర్వేనంబర్ 604లో 5.10 ఎకరాల భూమి ఉంది. సుమారు యాభై ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం 9 గంటల సమయంలో చేవెళ్లకు చెందిన కొజ్జంకి దుర్గప్రసాద్ మనుషులు 15మంది, రెండు కార్లలో వచ్చి భూమిలో చొరబడి సర్వే చేయిస్తున్నారు. వీరి వద్దకు వెళ్లి ఎవరని ప్రశ్నించిన కిష్టగౌడ్‌ను బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం

బొంరాస్‌పేట: జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్‌ను పలువురు నాయకులు, ఆయా సంఘాల సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు నర్సింలుగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.